క్లుప్తంగా

వైభవంగా మహా కామేశ్వరుని కల్యాణం



రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని పట్టణంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మహా కామేశ్వరుడు, కామేశ్వరిదేవిల కల్యాణం, కార్తిక వన సమారాధన ఆలయ ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారికి మంగళస్నానాలు చేయించి వధూవరులుగా అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణ వేడుకలను నిర్వహించారు. హిందూ ధర్మం, భారతదేశంలో వివాహ విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు మండల కార్యకర్తల సమావేశం

నగరం: నగరం మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం చెరుకుపల్లిలో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

డిసెంబర్ 1న ఉచిత వైద్య శిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని చైతన్య స్కూల్ సమీపంలోని ఎస్ఎస్ ఎడ్యుకేషనల్ అకాడమీలో డిసెంబర్ 1వ తేది ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఎస్ ఫౌండేషన్, రసాలయ కళాసమితి, మహమ్మద్ ఇమాముద్దీన్ ఖాదరీల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించబడునని రసాలయ కళాసమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోడే గౌరీశంకర్ తెలిపారు. స్థానిక ఎస్ఎస్ ఎడ్యుకేషనల్ అకాడమీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన డాక్టర్ హారూన్ రషీద్‌చే గుండె పరీక్షలు నిర్వహించబడునని పేర్కొన్నారు. శిబిరాన్ని పట్టణ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇమాముద్దీన్ ఖాదరీ, ఎస్ఎస్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ దాసు, రసాలయ కళాసమితి అధ్యక్షుడు రామచంద్రరావు, కోశాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథం

వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

వేమూరు: దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పవిత్ర గ్రంథం రాజ్యాంగమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. చెరుకుపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ భారత రాజ్యాంగ నవంబరు 26న ఆమోదించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను స్మరించుకోవాలని చెప్పారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఈ ప్రభుత్వం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి నారా లోకేశ్ రచించిన రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఎక్కడ చూసినా మహిళలపై అఘాయిత్యాలు, పసి పిల్లలు కూడా కామాంధులకు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్ బుక్ పాలన పక్కన పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతలకు కోటయ్య సేవలు ఎనలేనివి



రేపల్లె రూరల్: చేనేత పరిశ్రమ రక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేసిన చేనేత బాంధవుడు ప్రగడ కోటయ్యకు ప్రతి చేనేత కార్మికుడు రుణపడి ఉంటారని రేపల్లె చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యసభ సభ్యునిగా చేనేత కార్మికులకు కోటయ్య చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోటయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం నాయకులు జొన్నాదుల శ్రీనాగరాజు, మునగాల నాగేశ్వరరావు, సంజీవయ్య, సాంబశివరావు, వంగర కిరణ్, పట్టెం లీలాకృష్ణ, తుమ్మెర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

వరద నీటి కొలువు.. మురుగుకు నెలవు

- రెండు నెలలుగా పారిశుద్ధ్య సమస్య
- దుర్గంధం, దోమలతో ప్రజల వెతలు
- వరద నీరు తొలగక అవస్థలు
- కనీస చర్యలు శూన్యం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమయంలో సత్వర చర్యలు



తిప్పలకట్ట ఎస్సీ కాలనీ చెంత పల్లపు ప్రాంతంలో దుర్గంధ భరితంగా మారిన వరద నీరు

కొల్లూరు : కృష్ణా నదీ వరదల వల్ల సర్వం కోల్పోయిన తీర ప్రాంత వాసులు నేటికీ వరద నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టిన యంత్రాంగం నిల్వ నీటిని తొలగించడంపై దృష్టి కేంద్రీకరించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వరదలు సంభవించి 2 నెలలు గడిచినా గ్రామాల వెంబడి కొలువైన వరద నీటితో పలు గ్రామాలు అపరిశుభ్ర వాతావరణానికి నెలవుగా మారాయి. కృష్ణా వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే తూతూ మంత్రంగా ప్రభుత్వ యంత్రాంగం పారిశుద్ధ్య పనులు చేపట్టి చేతులు దులుపుకోవడంతో వరద నీటి నిల్వలు మురుగు కూపాలుగా మారి దుర్గంధం వెదజల్లుతూ, దోమల వ్యాప్తికి కేంద్రాలుగా మారాయి. మండలంలోని తిప్పలకట్ట, కిష్కిందపాలెం, గుంటూరుగూడెం, తడికలపూడి గ్రామాల వెంబడి గృహాలను ఆనుకొని ఉన్న గుంతలలో భారీగా వరద నీరు నిలిచి పోవడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తింది. జనావాసాల చెంతనే నిలిచిన ముంపు నీటిని అప్పట్లోనే, ఇంజన్ల సాయంతో బయటకు మళ్లించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడంతో అపరిశుభ్ర వాతావరణంలోనే జీవనం సాగించాల్సి రావడం పట్ల ప్రజలలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



కిష్కిందపాలెం ఎస్సీ కాలనీ వాటర్ ట్యాంక్ వెంబడి చెరువును తలపిస్తున్న వరద నీరు



కిష్కిందపాలెం వాటర్ ట్యాంక్ వద్ద గృహాలను ఆనుకొని మునిగిపోయిన వరద నీరు



తడికలపూడి గౌడపాలెం వెంబడి వరద నీటి గుంత

గత ప్రభుత్వంలో సత్వర చర్యలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమయంలో రెండు పర్యాయాలు సంభవించిన వరదల సమయంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఆయిల్ ఇంజన్ల సాయంతో వరద నీటిని మళ్లించి ప్రజలు ఇబ్బందులకు గురవకుండా సత్వర చర్యలు చేపట్టారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాలలో పూర్తిస్థాయి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం విమర్శలకు దారితీస్తుంది. వరద నీటి నిల్వల కారణంగా దోమల వృద్ధి, దుర్గంధాలను నిరోధించడానికి ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వేయడం వంటి ప్రాథమిక చర్యలు సైతం యంత్రాంగం చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు తక్షణం స్పందించి వరద ప్రభావిత గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

భట్టిప్రోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలకు వత్తాసు పలుకుతూ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు జరుపుతుందని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బి.శ్రీనివాసరావు, జి.సుధాకర్‌లు అన్నారు. జాతీయ రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు దేశ వ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు అప్పగించేందుకు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలను కాలరాస్తూ 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గాన్ని కార్పొరేటర్లకు బానిసలుగా మారుస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. అనంతరం ఆర్ఐ ఫణి కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జి.బాలాజీ, ఎం.సత్యన్నారాయణ, జి.నాగరాజు, ఎ.శ్రీనివాసరావు, కె.వీరమోహన్‌రావు, వి.శ్రీనివాసరావు, ఎస్.గోపాలరావు పాల్గొన్నారు.



ఆర్ఐ ఫణి కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖాజీపాలెం(కర్లపాలెం): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం గ్రామంలో జరిగింది. చందోలు ఎస్ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఖాజీపాలెం పంచాయతీ రజకపాలెం గ్రామానికి చెందిన మేత్ర శివన్నారాయణ (56) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి తన ఇంటిలో పైకప్పు దూలానికి తాడుతో ఉరివేసుకుని మృతి చెందాడని తెలిపారు. మృతుని అన్న కుమారుడు ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



భట్టిప్రోలు హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



రేపల్లెలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భట్టిప్రోలు: భారత పౌరులందరూ రాజ్యాంగ దినోత్సవాన్ని బాధ్యతగా జరుపుకోవాలని భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, లౌకిక రాజ్యం వంటి ప్రత్యేకతలతో మన రాజ్యాంగం విలసిల్లుతుందని చెప్పారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, మండల సమాఖ్య, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే టీఎంరావు హైస్కూల్‌లో అట్టడుగు వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.మల్లిఖార్జున రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల్: రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని రేపల్లె నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బేతపూడి వెంకటేశ్వరరావు, నాయకులు పిన్ని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు భాస్కరరావు, రవీంద్రబాబు, వెంకయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సెమినార్ నిర్వహించి రాజ్యాంగ ఆమోదిత దినోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు సుశీల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ 1949 నవంబరు 26న కానిస్టిట్యుయెంట్ అసెంబ్లీ ఆఫ్ ఇండియాను అడాప్ట్ చేసుకోగా 1950 నవంబరు 26 నుంచి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు సుశీల

కర్లపాలెం: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శవంతమైనవని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటాలకు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నివాళులర్పించారు. కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎస్ఐ రవీంద్ర అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య ఆధ్వర్యంలో దళిత నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య అధ్యక్షుడు ధనుంజయ్, గౌరవ అధ్యక్షుడు పరమానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పేద జీవితాల్లో వెలుగు నింపింది

బాపట్ల: భారత రాజ్యాంగం పేదల జీవితాల్లో వెలుగు నింపిందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు పేర్కొన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, జోగి రాజా, చందు, వడ్డిముక్కల డేవిడ్, సుభాని, తన్నీరు అంకమ్మరావు, నర్రావుల వెంకట్రావు, శాయిల మురళి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నేడు బొల్లిముంత జయంతి



తెనాలి: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ 104వ జయంతి మహోత్సవం బుధవారం సాయంత్రం ఆయన స్వస్థలమైన తెనాలిలో జరగనుంది. అభ్యుదయ కళాసమితి, ప్రజానాట్యమండలి, ఇస్కఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో ఏర్పాటయే సభకు పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి కాగితాల రాజశేఖర్, నాసా పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు పాల్గొంటారు. డాక్టర్ రంగిశెట్టి రమేష్ నిర్వహణలో సాంస్కృతిక ప్రదర్శనలు, అనంతరం బొల్లిముంత శివరామకృష్ణ రచించిన 'సంభవామి యుగే యుగే' నాటికను ప్రదర్శిస్తారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: రాజ్యాంగం అమలుతోనే భారతావనికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించిందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం నాటికి సమాజంలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో నిర్మించిన రాజ్యాంగంతోనే సమసమాజాభివృద్ధి సాధ్యమైందన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని గౌరవించుకుంటూ పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రశ్నించే గొంతులను తొక్కేస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

అమర్తలూరు(వేమూరు): రబీ పంటలకు బీమా డిసెంబరు 15వ తేది వరకు ఉంది, రైతులు, కౌలు రైతులు పంట బీమా చేయించుకోవాలని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ లక్ష్మి అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు, తురుమెళ్ల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు అపరాలలో రకాల ఎంపిక, విత్తన శుద్ధి, కలుపు మందుల వినియోగం సస్యరక్షణ తదితరాలను వివరించారు. మినుము పైరు ఎకరాకు రూ.60, పెసరకు రూ.35, జొన్నకు రూ.38, మొక్కజొన్నకు రూ.105 చొప్పున మీ సేవా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా బీమా చెల్లించాలని ఆమె తెలిపారు. రైతు ఆధార్ నెంబరు, పొలం సాగు విస్తీర్ణం, పంట పేరుతో రిజిష్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. మినుములో ఈ ఏడాది నూతనంగా వచ్చిన తక్కువ కాలపరిమితి రకం మినీ కిట్లు రైతులకు అందజేశారు. ఏఈవో శ్రీకాంత్, భార్గవ్, మణికంఠ కుమార్, భాస్కర్ రైతులు పాల్గొన్నారు.



చదలవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు

చదలవాడ(వేమూరు): రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు రైతు సేవా కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. వేమూరు మండలంలోని చదలవాడ, కాకర్లమూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సునీత మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17 కంటే తక్కువగా ఉంటే ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, రైతు గాజుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్



వినయ్‌కుమార్



బాపయ్య

నిజాంపట్నం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్ తెలిపారు. యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా వినయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా చుక్కా బాపయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వినయ్‌కుమార్ నిజాంపట్నం మండలంలోని ఎంపీపీఎస్ శారదానగర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా, చుక్కా బాపయ్య, ఎంపీపీఎస్ గోకర్ణమఠం పాఠశాలలో పనిచేస్తున్నారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. వినయ్‌కుమార్, బాపయ్యలను యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, గౌరవ అధ్యక్షుడు సీహెచ్ గణేష్‌రావు, సహ అధ్యక్షులు నాగరాజు, జిల్లా కౌన్సిలర్‌లు రాజేష్, హరిబాబులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు శ్రీనివాసులు

బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సూర్యలంక ఫ్లైఓవర్‌పై చోటు చేసుకుంది. రేపల్లె మండలం, ఇసుకపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి శ్రీనివాసులు (42) గత కొంతకాలం క్రితం ఒంగోలులో స్థిరపడ్డారు. మంగళవారం రేపల్లె నుంచి ఒంగోలు వెళ్తుండగా సూర్యలంక ఫ్లైఓవర్‌పై ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు రూరల్ సీఐ జి.గంగాధర్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వణికిస్తున్న వాయుగుండం



పేటేరు వద్ద పొట్ట దశలో ఉన్న వరి పైరు



రుద్రవరం వద్ద వరి కుప్పలు వేస్తున్న కూలీలు

- హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- హడావుడిగా వరి కోతలు, కుప్పలు

రేపల్లె రూరల్: వాయుగుండం హెచ్చరికలు రైతన్నలను వణికిస్తున్నాయి. పంట చేతికి అంది వచ్చే సమయంలో వస్తున్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు వణుకు పుట్టిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట నేల పాలు అవుతుందని భయాందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ఆరంభంలో అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితులను దాటుకొని పంట చివరి దశకు చేరుకున్న సమయంలో వాయుగుండం వెంటాడుతుంది. తాజాగా వాయుగుండం హెచ్చరికలతో రైతన్నలు అప్రమత్తమయ్యారు. నియోజకవర్గంలో కోత దశకు వచ్చిన పంటను హడావుడిగా కోయిస్తూ ఇప్పటికే కోతలు కోసిన వంటను కుప్పలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రేపల్లె నియోజకవర్గంలో 68,721 ఎకరాలలో రైతన్నలు వరి పంటను సాగు చేశారు. నియోజకవర్గంలో కాలువలకు ఎగువ ఉన్న భూముల్లో పంట చేతికి వచ్చే దశలో ఉండగా కాలువ చివరి భూముల్లో పంట పొట్ట, ఈనె దశలలో ఉంది. ఈ సమయంలో వర్షం కురిస్తే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పులు చేసి పంటం సాగు చేయాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వాతావరణశాఖ నుంచి తుఫాను హెచ్చరికలు వచ్చాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికే కోతలు కోసిన రైతులు కుప్పలు వేసుకోవాలి. కోతలు కోయని వారు కోయటం ఆపివేయాలి. ఎవరైనా యంత్రాల ద్వారా వరి ధాన్యం నూర్పిడి చేస్తే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

– ఆర్.విజయ్‌బాబు, ఏఓ

స్టీల్ ప్లేట్‌లు, గ్లాస్‌లు పంపిణీ

తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ అధ్యక్షుడు నేరెళ్ల కృష్ణ మోహన్ సహకారంతో అయితానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు మంగళవారం స్టీల్ ప్లేట్‌లు, గ్లాస్‌లు పంపిణీ చేశారు. క్లబ్ వ్యవస్థాపకులు సుబ్రమణ్యం, రాజ కుమార్, నంబూరి కుమరా, కరస్పాండెంట్ లతాకుమారి, హెచ్‌ఎం స్వర్ణలత, జాకబ్ పాల్గొన్నారు.